అడవి తల్లి.. గరిగుట్ట పెద్దమ్మ

- జల్‌పల్లి జాతరకు ఏర్పాట్లు షురూ..
- 11నుంచి కల్యాణ మహోత్సవాలు



గరిగుట్టపై పెద్దమ్మ ఆలయం

పహాడీషరీఫ్: జల్‌పల్లి మాదన్నగూడలోని చారిత్రాత్మకమైన గరిగుట్ట పెద్దమ్మ ఆలయ 45వ కల్యాణ మహోత్సవాల(జాతర)కు సిద్ధమయ్యింది. మూడు రోజుల పాటు కన్నుల పండువగా జరగనున్న ఈ ఉత్సవాలను పురస్కరించుకొని ఇప్పటికే ఆలయంతో పాటు ఆలయానికి వచ్చే అటవీ ప్రాంతంలోని చెట్లను కూడా జాజు, సున్నంతో అలంకరించారు. వెరసి మాదన్నగూడ అటవీ ప్రాంతం ప్రత్యేక ఆకర్షణీయతను సంతరించుకుంది. ఈ జాతరకు జల్‌పల్లి గ్రామంతో పాటు శ్రీరాం కాలనీ, మామిడిపల్లి, పహాడీషరీఫ్, చాంద్రాయణగుట్ట, సరూర్‌నగర్, బాలాపూర్, కాటేదాన్, మధుబన్ కాలనీ, గగన్‌పహాడ్‌ల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలిరానున్నారు. ఆలయ ప్రాంగణంలో విద్యుద్దీపాల ఏర్పాటు, మంచినీటి సదుపాయం కల్పించడం, పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా మున్సిపాలిటీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

దట్టమైన అడవిలో పెద్దమ్మ తల్లి

జల్‌పల్లి గ్రామం నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో దట్టమైన మాదన్నగూడ అటవీ ప్రాంతంలో గరిగుట్టపై పెద్దమ్మ అమ్మవారు కొలువుదీరారు. భారీ వన సంపద నడుమ వెలసిన ఈ ఆలయంలో అమ్మవారితో పాటు.. ఆలయ కుడి భాగంలో కొద్ది దూరంలో సమ్మక్క, సారక్కల గద్దెలు నెలకొల్పారు. అడవులకు రక్షణగా ఉండేలా ఈ అమ్మవార్ల గద్దెల ప్రతిష్ఠించినట్లు ప్రతీతి. అమ్మవారి కుడి భాగంలో కొండపైన ఆంజనేయ స్వామి విగ్రహం నెలకొల్పారు. దీనికి సమీపంలోనే కొండలపై రెండు గుండం(కోనేరు)లు ఉన్నాయి. ప్రతి అమావాస్య, పౌర్ణమి రోజున ఇక్కడ ప్రత్యేక పూజలు జరుగుతాయి. ఏడాదికోమారు ఉత్సవాలు నిర్వహిస్తారు. స్వర్గీయ కరన్‌కోట కిషన్‌బాబా తమ పెద్దల నుంచి వారసత్వంగా ఆలయంలో పూజలు నిర్వహిస్తూ వచ్చారు. ప్రస్తుతం ఆయన కుమారుడు విఠల్‌బాబా మూడు దశాబ్దాల నుంచి పూజలు చేస్తున్నారు.

ఆలయాన్ని నిర్మించిన మాదన్న

తానీషా హయాంలో ఉన్నత పదవిలో కొనసాగిన మహేశ్వరం ప్రాంత వాసి మాదన్న ఈ అటవీ ప్రాంతం నుంచి వెళ్లే క్రమంలో శిబిరంలో నిద్రిస్తుండగా అమ్మవారు కలలో ప్రత్యక్షమై ఆదేశించడంతో పెద్దమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించినట్లు ప్రతీతి. ఈ క్రమంలోనే ఈ ప్రాంతాన్ని మాదన్నగూడ అంటారని జల్‌పల్లి వాసులు అభిప్రాయపడుతున్నారు. ఈ జాతర ఉత్సవాల సందర్భంగా జల్‌పల్లి గ్రామ ప్రజలు ఇంటి ఆడపడుచులు, ఇతర బంధువులను ఆహ్వానించి మూడు రోజుల పండుగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

వైభవంగా నిర్వహిస్తాం



గరిగుట్ట పెద్దమ్మ కల్యాణ మహోత్సవం ఫిబ్రవరి 11న ప్రారంభం కానుంది. 12న బోనాలు, 13న అగ్నిగుండాల ప్రవేశం, సదరు పటం ఉంటాయి. ఒగ్గు కళాకారుల ఆట పాటలతో జాతరంతా సందడిగా మారనుంది. జల్‌పల్లి, శాతంరాయిల నుంచి ఆలయం వరకు శాశ్వత రోడ్డు మార్గం వేయాలి. జాతర సందర్భంగా భారీగా తరలివచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా పోలీస్, మున్సిపాలిటీ శాఖలు తగిన చర్యలు చేపట్టాలి. ముఖ్యంగా అటవీ శాఖ అధికారులు తమకు పూర్తిస్థాయిలో సహకరించాలి.

– విఠల్‌బాబా, ఆలయ ధర్మకర్త

క్లుప్తంగా

రేపు మండల సర్వసభ్య సమావేశం

మహేశ్వరం: మండల కేంద్రంలోని ఎంపీడీఓ సమావేశం మందిరంలో మంగళవారం ఉదయం 10:30 గంటలకు ఎంపీపీ కోరుపోలు రఘుమారెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నర్సింహ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు సకాలంలో హాజరై వారివారి ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చి పరిష్కార మార్గాలను ఎంచుకోవాలని కోరారు.

ఉత్సాహంగా ‘అంకుర్ -2023’



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

మీర్‌పేట: కార్పొరేషన్ పరిధిలోని శ్లోక స్కూల్ వార్షికోత్సవ వేడుకలను అంకుర్ – 2023 పేరిట శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల వ్యవస్థాపకులు పట్లోరి కృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ దీప, డైరెక్టర్ అశోక్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు చంద్రమోహన్ పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణోత్సవం



కల్యాణ వెంకన్నను దర్శించుకుంటున్న నర్సింహారెడ్డి తదితరులు

కందుకూరు: మండలంలోని పులిమామిడి చీకటి వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం ఆలయ ధర్మకర్తలు మొకరాల లక్ష్మణ్ శర్మ, రాజశేఖర్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం పల్లకి సేవ నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. ఈ వేడుకలో జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, ఎంపీపీ మంద జ్యోతి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, బీజేపీ నియోజకవర్గ నాయకులు అందెల శ్రీరాములు యాదవ్, ఎల్మటి దేవేందర్‌రెడ్డి, సర్పంచ్ అనిత, ఎంపీటీసీ రాజమ్మ, ఉప సర్పంచ్ వెంకటేష్‌చారి తదితరులు పాల్గొన్నారు.

అనాథాశ్రమంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న యువకులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్ మాతృదేవోభవ అనాథ, మానసిక దివ్యాంగులకు విశేష అన్నదానం నిర్వహించారు. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, బడంగ్‌పేట వాసి లిక్కి కృష్ణారెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని అనాథలకు అన్నదానం చేశారు. 5 కింటాళ్ల బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాథలకు అండగా ఉంటామన్నారు.

బీజేపీలో చేరికలు



యువకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న శ్రీరాములు యాదవ్

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలో బీజేపీ జెండా ఎగుర వేస్తామని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందెల శ్రీరాములు యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. 17వ వార్డు కౌన్సిలర్ ఎనగండ్ల ప్రశాంతి శ్రీధర్ గౌడ్ నేతృత్వంలో యువకులు ఆదివారం బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా శ్రీరాములు యాదవ్ మాట్లాడుతూ... హైదరాబాద్ మహా నగరాన్ని ఆనుకొని ఉన్న జల్‌పల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందన్నారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలని ఆయన కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మనోజ్‌కుమార్, గొరిగె మల్లేష్, హరికృష్ణ, సుమిత్, శ్రవణ్, రాజేందర్, బాలకృష్ణ, కృష్ణ, సుధాకర్, నాగరాజు, గణేష్, ఫాతిమా బేగం తదితరులు పాల్గొన్నారు.

హిందువులంతా ఏకం కావాలి



సమావేశంలో పాల్గొన్న కుల సంఘాల ప్రతినిధులు

హుడాకాంప్లెక్స్: హిందూ దేవుళ్లను కించపరచకుండా ప్రభుత్వం చట్టాలను రూపొందించాలని అయ్యప్ప జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ నాయిని బుచ్చిరెడ్డి గురుస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం కొత్తపేట చౌరస్తాలో ఏర్పాటు చేసిన హిందూ ధర్మ రక్షకుల ఆత్మీయ సమావేశానికి కుల సంఘాల ప్రతినిధులు, ధర్మసంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. హిందూ దేవుళ్లు, అయ్యప్ప స్వామి, హిందూ ధర్మంపై ఎవరైనా అనుచిత వ్యాఖ్యలు చేసినా ప్రతి ఒక్కరూ ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. కులాల మధ్య కుంపటి పెడుతూ హిందూ దేవుళ్లను దూషించకుండా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో బాలకృష్ణ, రాధాకృష్ణ, ప్రేంగాంధీ, వివిధ కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

యాదవులకు రిజర్వేషన్లు కల్పిస్తాం

ప్రజాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అజయ్‌కుమార్ యాదవ్



అభివాదం చేస్తున్న నాయకులు

తుక్కుగూడ: తాము అధికారంలోకి వస్తే యాదవులకు 10శాతం రిజర్వేషన్లు కేటాయిస్తామని ప్రజా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్‌కుమార్ యాదవ్ అన్నారు. ఆదివారం తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాలలో యాదవ సంఘం నాయకులతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీని ముఖ్యమంత్రి చేయడంతో పాటు, బీసీలకు 50శాతం రిజర్వేషన్ కల్పిస్తామన్నారు. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో ఉప ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే గొర్రెల పంపిణీ పథకం గుర్తుకు వస్తోందన్నారు. గొర్రెల పథకం కింద డీడీలను చెల్లించిన వారికి వెంటనే నగదును బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. గొర్రెల పెంపకం కోసం షెడ్ల నిర్మాణంతో పాటు, ఫారెస్టు భూములను తమకు అప్పగించాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు భిక్షపతి యాదవ్, అంజి యాదవ్, ప్రశాంత్ యాదవ్, పాండు యాదవ్, వెంకటేశ్ యాదవ్, రాందాస్ యాదవ్, సత్యానారాయణ యాదవ్, యాదయ్య యాదవ్, బాబు పాల్గొన్నారు.

యువత ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలి

పీఏసీఎస్ వైస్ చైర్మన్ గోపిరెడ్డి విజేందర్‌రెడ్డి



అభ్యర్థులకు పుస్తకాలు అందజేస్తున్న గోపిరెడ్డి విజేందర్‌రెడ్డి

కందుకూరు: యువత ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేలా ముందుకు సాగాలని పీఏసీఎస్ వైస్ చైర్మన్ గోపిరెడ్డి విజేందర్‌రెడ్డి సూచించారు. ఫిజికల్ డైరెక్టర్ హేమంత్‌కుమార్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ పొందిన మండలంలోని లేమూరు, సరస్వతిగూడ గ్రామాలకు చెందిన ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఫిజికల్ టెస్ట్‌లో ఎంపికైన అభ్యర్థులను ఆదివారం ఆయన అభినందించారు. ఎంపిక పరీక్షకు సిద్ధమవుతున్న వారికి పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల వారికి న్యాయం చేస్తోందన్నారు. యువత ఉద్యోగాలు సాధించేలా ఉచిత శిక్షణ ఇవ్వడం గొప్ప విషయమన్నారు. ఇలాంటి అవకాశాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మా మధ్య చిచ్చుపెడితే సహించం

మంత్రి సబితారెడ్డిపై కాంగ్రెస్ నాయకుల ఆగ్రహం



కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న మల్లాపూర్ వాసులు

బడంగ్‌పేట్: మా మధ్య చిచ్చు పెడితే సహించేది లేదని మంత్రి సబితారెడ్డిపై కాంగ్రెస్ నాయకులు, కార్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. మహోన్నత వ్యక్తి, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని కోల్పోయిన తరువాత ఆ స్థానం మీకు ఇచ్చి గెలిపిస్తే స్వార్థం కోసం పార్టీ మారి మా ప్రాంత కాంగ్రెస్ నాయకుల మధ్య చిచ్చు పెట్టడం సరికాదని హితవు పలికారు. బడంగ్‌పేట పరిధిలోని మల్లాపూర్‌కు చెందిన పలువురు ఆదివారం నర్సింహారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హస్తం గుర్తుపై ఎమ్మెల్యేగా గెలిచి రెండు సార్లు మంత్రిని చేసిన పార్టీనే మరచిపోయావా అని సబితారెడ్డిని ప్రశ్నించారు. ఇంద్రారెడ్డి మరణం తర్వాతా రాజకీయ భిక్ష పెట్టిన వైఎస్‌ఆర్‌ను ఎందుకు గుర్తు చేసుకోవడం లేదని నిలదీశారు. మేయర్ పారిజాతతో రాజీనామా చేయించి తిరిగి గెలిపిస్తామని సవాల్ విసిరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, బండారి మనోహర్, రాళ్లగూడం సంతోషి, పి.సుదర్శన్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు పెద్దబావి వెంకట్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు బోయపల్లి రాఘవేందర్ రెడ్డి, ఆర్ శ్రీనివాస్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు అమృతనాయుడు, గట్టు బాలకృష్ణ పాల్గొన్నారు.

ఆపదలో అండగా ఉంటాం

డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మహేశ్వరం: ఆపదలో ఉన్నవారికి తనవంతుగా సహాయం అందించి అండగా ఉంటానని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, పార్టీ నియోజకవర్గ నాయకుడు చిగురింత నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని గొల్లూరు గ్రామానికి చెందిన అర్ల దేవేందర్ యాదవ్ గుండెపోటుతో మృతి చెందడంతో కుటుంబ సభ్యులను ఓదార్చి, ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సామాజిక సేవే లక్ష్యంగా తాను నిరంతరం పని చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ పేదల పక్షాన నిలబడి పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో గొల్లూరు మాజీ సర్పంచ్ హరినాథ్ గౌడ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గొల్లూరు రాజు, గొల్లూరు గ్రామ అధ్యక్షుడు పెండ్యాల బాల్‌రాజ్, పార్టీ సీనియర్ నాయకులు మంద రాజు, మంత్రి బాల్‌రాజ్, చంద్రమోహన్, ఇమ్మడి ప్రవీణ్, జైపాల్ యాదవ్, సతీష్ గౌడ్, నర్సింహ, శివ యాదవ్, రాఘవేందర్, సత్తయ్య, సుధాకర్, విఘ్నేష్ గౌడ్, మల్లేష్ పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రతాప్

బీజేపీ వనపర్తి జిల్లా ఇన్‌చార్జి ప్రతాప్

తుర్కయంజాల్: కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు బూత్ లెవల్ కమిటీలు, శక్తి కేంద్రాలు కృషి చేయాలని వనపర్తి జిల్లా ఇన్‌చార్జి బోసుపల్లి ప్రతాప్, జిల్లా ప్రధాన కార్యదర్శి పోరెడ్డి అర్జున్ రెడ్డి అన్నారు. ఆదివారం తుర్కయంజాల్‌లో మున్సిపాలిటీ అధ్యక్షుడు తూళ్ల నర్సింహగౌడ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యవర్గసమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. బూత్ స్థాయిలో కార్యకర్తలు పటిష్టం అయితే పార్టీకి ప్రజల మద్దతును కూడగట్టే అవకాశం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి అశోక్‌గౌడ్, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ యాదగిరిరెడ్డి, రాష్ట్ర నాయకులు దయానంద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బలమైన శక్తిగా తయారుచేద్దాం..

మంచాల: గ్రామాల్లో బీజేపీని బలమైన శక్తిగా తయారుచేయాలని ఆ పార్టీ మండల ఇన్‌చార్జి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మంచాల మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పార్టీ నిబంధనల ప్రకారం ప్రతి కార్యకర్త నడుచుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అశోక్‌గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ భాషయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు గోవర్ధన్‌చారి, నాయకులు వెంకట్‌రెడ్డి, జంగయ్య గౌడ్ పాల్గొన్నారు.

నేత్రపర్వంగా స్వామివారి కల్యాణం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేద పండితులు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ అల్కాపురిలోని శ్రీ భ్రమరాంబామల్లికార్జున స్వామి, ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయ సప్తదశ ఆలయ వార్షికోత్సవాల సందర్భంగా ఆదివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం దుర్గాహోమం, నవగ్రహ హోమం, ఆలయ దేవతా హోమాలు, మహా పూర్ణాహుతి, శ్రీరమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. ఈ సందర్భంగా భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్ల కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ... లోక కల్యాణార్థం, దేశంలోని ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని భ్రమరాంబా మల్లికార్జునుల కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. అనంతరం నారాయణ సేవ, మహా ప్రసాద వితరణ నిర్వహించారు. శ్రీ శృంగేరి శంకరమఠం బ్రాంచ్‌హెడ్ శ్రీనివాస్, నిర్వాహకులు వి.ఆర్.గౌరి శంకర్, విశ్వనాథ శోభనాద్రి, యడవల్లి సూర్యనారాయణరావు, గౌరీభాస్కర్, ముదికొండ శంకరశర్మ, సూరి వ్యాస్‌కుమార్, నరసింహమూర్తి, సుధాకర్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి నిర్మాణానికి నిధులివ్వండి

ఎమ్మెల్సీ కసిరెడ్డికి కేఎస్‌ఆర్ సేవాదళం వినతి

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి భవనం శిథిలావస్థకు చేరుకుందని.. వెంటనే నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డిని కేఎస్‌ఆర్ సేవాదళం అధ్యక్షుడు మెకానిక్ బాబా కోరారు. హైదరాబాద్‌లో ఆదివారం ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డిని కేఎస్‌ఆర్ సేవాదళం ఆధ్వర్యంలో నేతలు కలిసి వినతిపత్రం అందజేశారు. ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిని ప్రభుత్వం ఇటీవల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా అప్‌గ్రేడ్ చేసిందని అయితే ఆ మేరకు ఇంకా సౌకర్యాలు కల్పించలేదని వివరించారు. అప్‌గ్రేడ్ చేసిన ఆస్పత్రికి వెంటనే నూతన భవనం నిర్మించాలని వారు కోరారు. ఆమనగల్లు పట్టణంలో పలు కాలనీలలో బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేయాలని వారు వినతిపత్రంలో కోరారు. సభ్యులు కండె వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల సత్తా



మెడల్స్, సర్టిఫికెట్లతో చిన్నారులు

తుర్కయంజాల్: విశాఖపట్నంలోని స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియంలో ఈనెల 3,4,5 తేదీల్లో నిర్వహించిన 6వ ఇంటర్నేషనల్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో మునగనూర్ ప్రీమియర్ మార్షల్ ఆర్ట్ అకాడమీకి చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. జోష్ణ, అఖిలాష్, రాఘవరెడ్డి, విక్రమ్, అమన్ అసుతోష్ కరాటేలోని పలు విభాగాల్లో మెడల్‌లను సాధించినట్లు కరాటే మాస్టర్ సుదర్శన్ తెలిపారు. వారిని ఆదివారం సన్మానించారు.

నేడు వైఎస్సార్‌టీపీ కార్యాలయం ప్రారంభం

ఆమనగల్లు: మాడ్గుల మండల కేంద్రంలో సోమవారం వైఎస్సార్‌టీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్నట్లు ఆపార్టీ నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యాలయ ప్రారంభోత్సవానికి వైఎస్సార్‌టీపీ కల్వకుర్తి ఇన్‌చార్జి చీమర్ల అర్జున్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలోహాజరుకావాలని వారు కోరారు.

ఇంటర్ విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు



క్యాట్ వాక్‌లో పాల్గొన్న విద్యార్థులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు అనుసంధానంగా నడుస్తున్న పల్లవి మోడల్ స్కూల్‌లో ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యాసంస్థల చైర్మన్ మల్కా కొమురయ్య ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు వీడ్కోలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్య అభ్యసించి పలు రంగాల్లో స్థిరపడాలని, దేశానికి, ఈ ప్రాంతానికి పేరు తెచ్చేలా ఎదగాలని కోరారు. అనంతరం నిర్వహించిన క్యాట్ వాక్‌లో విద్యార్థులు పాల్గొన్నారు. మిస్ పల్లవి కిరీటాన్ని నిదా హుస్సేన్, మిస్టర్ పల్లవిని మహమ్మద్ అబ్రార్ గెలుచుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శైలజరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సెంట్రింగ్ కార్మికుల సంక్షేమానికి కృషి

మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతాప్‌రెడ్డి, నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: బిల్డింగ్ వర్కర్స్ సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కృషిచేస్తుందని ఇబ్రహీంపట్నం మండల ప్రజాపరిషత్ ఉపాధ్యక్షుడు మంచిరెడ్డి వెంకటప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం మండలంలోని ఎల్మినేడు గ్రామంలో శ్రీ వేంకటేశ్వర భవన నిర్మాణ (సెంట్రింగ్) కార్మిక సంఘం కార్యకర్తల సమావేశం ఆదివారం ఎల్మినేడు గ్రామంలో జరిగింది. ఈ సమావేశం అనంతరం సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంచిరెడ్డి వెంకటప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా బీమా సౌకర్యం కల్పించిందన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి నాయకత్వంలో కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు జంగయ్య, ఉపాధ్యక్షుడు భాష, కోశాధికారి ఐలయ్య, సెక్రెటరీ రమేష్, జనరల్ సెక్రెటరీ మల్లేశ్, వ్యవస్థాపకులు జంగయ్య, నారయణ, కార్మికులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

ఆమనగల్లు: ప్రతి ఒక్కరూ దైవచింతన కలిగి ఉండాలని ఆమనగల్లు మాజీ జెడ్పీటీసీ సభ్యుడు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, మండల రైతు సమన్వయ సమితి కన్వీనర్ నారాయణ తెలిపారు. ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి గ్రామంలో గౌడసంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న కంట మహేశ్వరస్వామి దేవాలయం, ఎల్లమ్మ దేవాలయం నిర్మాణాలకు గౌడసంఘం నాయకులతో కలిసి ఆదివారం వారు భూమిపూజ నిర్వహించారు. ఆలయ నిర్మాణానికి తమవంతు సహకారం అందిస్తామని వారు చెప్పారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావన కలిగిఉండాలని అన్నారు. ఆలయాల నిర్మాణాలకు దాతలు ముందుకురావాలన్నారు. సర్పంచ్ శ్రీపాతి రజిత, ఎంపీటీసీ మంగమ్మ, ఉపసర్పంచ్ శేఖర్‌గౌడ్, గౌడసంఘం నాయకులు బొందయ్యగౌడ్, రాముగౌడ్, బాలయ్యగౌడ్, నారాయణగౌడ్, నర్సింహగౌడ్, జంగమయ్య, శేఖర్, కృష్ణ పాల్గొన్నారు.



మండలంలోని గుర్రంగూడ వీఎంఆర్ కన్వెన్షన్‌లో ఆదివారం జరిగిన ఎస్‌టీయూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు యాసాని కరుణాకర్‌రెడ్డి కుమారుడు జైదీప్‌రెడ్డి వివాహం జరిగింది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మణికంఠరెడ్డి, లక్ష్మణ్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. జిల్లా కార్యదర్శి ఈటీ నర్సింహ్మా, ప్రజానాట్య మండలి నాయకుడు పల్లె నర్సింహులు పాల్గొన్నారు. – హుడాకాంప్లెక్స్